# మనసు చూపిన మార్గం

'వాచస్పతి'



ఐదు గంటలకల్లా, అలవాటు ప్రకారం టంచనుగా మెలుకవ వచ్చింది సరస్వతీ దేవికి. కళ్ళు మూసుకునే ఓ నిముషం పాటు భగవంతుణ్ణి ప్రార్థించింది. ఆ రోజు పనిచేసేందుకు కావలసిన శక్తినీ సమస్యలను పరిష్కరించుకోను కావలసిన మనోధైర్యాన్ని చివరగా మనశ్శాంతినీ ప్రసాదించమని. మంచం మీద నుండి లేచి హాల్లోకి వచ్చి, పెరటి వేపు చూపులు సారించింది. స్నానాల గదిలో బాయిలర్‌లో నీళ్ళు పోస్తున్న శబ్దం వినిపించింది.

'రాజమ్మ అప్పుడే లేచినట్లుందే! ఈ రోజు నేను కాలేజీకి వెళ్ళవలసిన అవసరం లేదన్న విషయం మరచిపోయింది కాబోలు!' అనుకుంటూ, ముందు గది తలుపుతీసి, వరండాలోకి వచ్చి, విశాల, నీలాకాశాన్ని పృధ్వినీ ఆరోజే కొత్తగా చూస్తున్నట్లు చూసింది ఆనందంగా! ఉషోదయమైంది. వసంత ఋతువు తన ఆగమనాన్ని తెలుపుతోంది. పూల పరిమళాలతో నిండిన చల్లని గాలీ, పచ్చని చెట్లూ, రంగురంగుల పూలూ మనసుకెంతో హాయినీ, సంతోషాన్ని కలిగిస్తున్నాయి. తను వేసి పెంచిన చెట్లనూ, మొక్కలనూ ఒక్కొక్కదాన్నీ పేరు పేరునా చూపులతోనే పలకరించి, సంతృప్తి చెందుతూ, వరండాలోనే ఉన్న చెక్క కుర్చీలో కూచుంది. పేపర్ బాయ్ వచ్చి 'గుడ్ మార్నింగ్ మేడమ్!' అని, ఆనాటి పేపరు సవినయంగా ఆమె చేతికి అందించాడు. చిరునవ్వుతో ఆ అబ్బాయిని పలకరించి, పేపరు తీసుకుని త్రిప్పసాగింది.

అంతలో రాజమ్మ వచ్చి "ముఖం కడుక్కోమ్మా! కాఫీ కలుపుతున్నాను" అంది.

"అలాగే! కానీ, రాజమ్మా! ఇక మీదట నువ్వు ప్రొద్దున్నే లేచి హడావుడి పడవలసిన అవసరంలేదు" అంది పేపర్లో నుండి తలెత్తి, మందస్మితంతో.

"అదేమిటమ్మా! ఓహో... మరచిపోయాను. అలవాటు ప్రకారం లేచాను. అయినా ఐదు గంటలకల్లా ఓగ్లాసు కాఫీ త్రాగందే ఏపనీ చెయ్యి బుద్ధికాదు. పోనీ, మీరు పడుకోండి! నా పనేదో నేను చేసుకుంటాను" అంది. "కొన్ని సంవత్సరాలుగా ఉన్న అలవాట్లను మార్చుకోవాలన్నా కష్టమే! నేను మటుకు ఎంతసేపని పడుకోను? నువ్వు కాఫీ కలుపు, ఈ లోపల నేను ముఖం కడుక్కుని

**ముప్ఫైఐదు సంవత్సరాలపాటు లెక్చరర్ ఉద్యోగం చేసిన ఆమె, భర్తపోయిన తర్వాత పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు చేసింది..బాధ్యతలు తీరాయి. పదవీ విరమణ అయింది. అయినా యిక చెయ్యవలసింది మటుకు ఏముంది..అనుకుంటుండగా ఆమె జీవితంలో ఓ చిత్రమైన సంఘటన జరిగింది!**

వస్తాను. అన్నీ మామూలు టైంకే జరిగిపోవడం మంచిది", అంటూ పెరట్లోకెళ్ళి ఓ ఐదునిముషాల్లో ముఖం కడుక్కుని వచ్చింది సరస్వతీదేవి.

గాజు మగ్గు నిండా కాఫీ తెచ్చి, ఆమెకిచ్చింది రాజమ్మ. తనూ కాఫీ తెచ్చుకుని, 'ఆమె కెదురుగా కూచుంది. "ఈ ఉషోదయవేళ, చల్లనిగాలి శరీరానికీ, మనసుకూ గిలిగింతలు పెడుతుంటే, ఇలా వరండాలో కూచుని కాఫీత్రాగడం ఎంత బాగుంటుంది! ముసుగు కప్పుకుని గదిలో పడుకుంటే, ఈ ఆనందం వస్తుందా?" అని కాఫీ ఒక్కోగుక్కే త్రాగసాగింది.

"నిజమే! ఈ రోజు నుండి మీకిక కాలక్షేపం కావడం కాస్త కష్టమే!"

"ఆ విషయం గురించే ఆలోచిస్తున్నాను.."

చెట్ల గురించి, పూలగురించి మాట్లాడుకుంటూ ఇద్దరూ కాఫీ త్రాగడం పూర్తి చేసారు.

సరస్వతీదేవి చేతిలోని మగ్గు తీసుకుని లోపలికెళ్ళిపోయింది రాజమ్మ.

పేపరు తిరగేస్తూ, తన ఆలోచనల్లో తను తేలిపోసాగింది సరస్వతీ దేవి.

ముప్ఫైఐదు సంవత్సరాలుగా చేస్తున్న లెక్చరర్ ఉద్యోగం నుండి నిన్ననే రిటైర్ అయింది తను. ప్రిన్సిపాల్‌గా కూడా తనకు వేరే ఊళ్ళలోని కాలేజీలకు ఆర్డర్సు వచ్చాయి గానీ, తను వెళ్ళలేదు. ఒక కాలేజీ హెడ్‌గా ఆ బరువు బాధ్యతలను, విధి నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించే ఓపికా, శక్తి సామర్థ్యాలు లేక కాదు. కుటుంబ పరిస్థితులు తనను ఇక్కడ నుండి కదలలేని విధంగా కట్టి పడేసాయి.

సొంత ఇల్లు కట్టుకోవాలన్న కోరిక తీరక ముందే ఆయన తనకు శాశ్వతంగా దూరం అయ్యారు. సడెన్‌గా ఆయన గుండెపోటుతో మరణించడంతో, తనకు దిక్కుతోచనట్లయింది. సగం కట్టిన ఇల్లూ, కాలేజీల్లో చదువుతున్న ఇద్దరాడపిల్లలూ, జీవిత భాగస్వామిని పోగొట్టుకున్న తీరని ఆవేదనా-ఇవన్నీ పెద్ద పదవులకు తనను దూరం చేసాయనే చెప్పాలి. అందుకు ఏనాడూ తాను పశ్చాత్తాపపడలేదు. ఆయన తనకు భౌతికంగా దూరమైనా, మానసికంగా తన వెంట ఉన్నారనే భావనే తనకు ఎనలేని మనో ధైర్యాన్నిచ్చింది. అందుకనే సగం కట్టిన ఇంటిని బంధువుల, స్నేహితుల సహకారంతో పూర్తి చేయగలిగింది. ఇల్లు పూర్తయ్యే సరికి, పెద్దమ్మాయి జ్యోతి ఎమ్.ఎ.చేసి, ఎమ్.ఫిల్ కూడా చేసి ఓ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా చేరింది. చిన్నమ్మాయి జయ బి.కాం. పాసయ్యాక, బ్యాంక్ పరీక్షలు వ్రాసి బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకుంది. ఓ సంవత్సరం తేడాలో ఇద్దరికీ తగిన సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేసేసింది.

అమ్మాయి లిద్దరూ అత్తవారిళ్ళకు వెళ్ళిపోయాక, వంటరితనం, దిగులూ తనను క్రుంగ దీసాయి. ఆయనపోయాక ఐదు సంవత్సరాలపాటు ఒక విధమైన పట్టుదలతో పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు ఇళ్ళు కట్టడం పూర్తి చేసింది. ఆ బాధ్యతలన్నీ పూర్తి కాగానే 'ఇక చేయవలసిందేముంది? ఉద్యోగం మటుకు ఎందుకు?' అన్న ప్రశ్న పదేపదే కలగసాగింది.

వెను వెంటనే ఉద్యోగం మానేసి ఏం చెయ్యాలి? అన్న ప్రశ్నా కలిగేది. తోచీతోచని చిత్రమైన స్థితి!

అలాంటి సమయంలోనే - ఐదుసంవత్సరాలక్రితం - ఓ చిత్రమైన సంఘటన జరిగింది!

ఓ రోజు సాయంత్రం - మ్యాగజైన్ తిరగవేస్తూ వరండాలో కూచోనుంది.

నమస్కారమమ్మా!" అన్న మాటలకు తలెత్తి చూసింది.



ఓ ముప్పైఐదు సంవత్సరాల స్త్రీ వరండా మెట్ల దగ్గర నిలుచునుంది. ఆమె వేషాన్ని బట్టీ చాలా పేదరాలని అర్థమైంది.

ప్రతి నమస్కారం చేస్తూ, ప్రశ్నార్థకంగా ఆమె ముఖంలోకి చూసింది.

"నాపేరు రాజమ్మ! మీరు నాకు సాయం చేస్తారన్న ఆశతో వచ్చాను" అందామె.

కొద్ది క్షణాలు ఆమె ముఖంలోకి పరీక్షగా చూసి "ఇలా వచ్చి కూచోండి!' అంది తను, తన ప్రక్కనున్న కుర్చీ చూపుతూ.

ఆమె వరండాపైకి వచ్చి, తను చూపిన కుర్చీలో కూచోక కింద కూచుంది.

"అరరే! అదేంటి?"...

"పర్వాలేదమ్మా!"

"సరే! ఇక చెప్పండి! నేను మీకెలాంటి సాయం చేయగలను?"

"నేనో అనాధను.." దుఃఖ చలిత కంఠంతో అంది.

"అయ్యో! ఎవ్వరూ లేరా?"

"ఒకప్పుడుండేవారు. ప్రస్తుతం ఎవ్వరూ లేనట్టే లెక్క! పెళ్ళయిన ఐదేళ్ళకే పచ్చకామెర్లతో ఆయన పోయారు. ఆ జబ్బు విషయం ముందే తెలుసుకోలేక పోయాం. అది ముదిరి ప్రాణాన్ని తీసుకుంది. అప్పటికి మూడు సంవత్సరాల పిల్లా, సంవత్సరం పిల్లాడూ ఉన్నారు. పిల్లాడి విషయంలో సరైన శ్రద్ధ తీసుకోక పోవడంతో జ్వరంతో తీసుకుని ఆయన పోయిన సంవత్సరం లోపే వాడూ నాకు దూరమయ్యాడు."

"ఎంత దురదృష్టం!"

"అవునమ్మా! నా దురదృష్టం నన్నివ్పటికీ వొదలలేదు. పిల్లా నేనూ ఒకరికొకరం అన్నట్టు మిగిలాం. ఆయన ఇచ్చిపోయిన ఆస్తేమీ లేదు. ఉద్యోగం చేసే అర్హతలేవీ నాకు లేవు. పాచిపనీ వంటపనీ చేసేందుకు నేను సిద్ధపడ్డా, పుట్టింటి వాళ్ళూ అత్తింటివాళ్ళూ అభ్యంతరం చెప్పారు. అందుకనే, పుట్టింట్లో కొన్నేళ్ళపాటు ఉండి, వాళ్ళకు అడ్డమైన చాకిరీ చేసాను. పదేళ్ళు గడిచాక అమ్మానాన్నా చనిపోయారు. వాళ్ళుపోయాక అన్నలూ వదినలూ నన్నూ నా పిల్లనూ మరీ హీనంగా చూడ సాగారు. నాలాంటి దానికి అభిమానం ఉండ కూడదు. అయినా, ఆత్మాభిమానాన్ని పూర్తిగా చంపుకోలేక పోయాను. మరది, తోడికోడలు దగ్గరకెళ్ళి నాగోడు వెళ్ళబోసుకున్నాను. తన ఇంట్లో వచ్చి ఉండమనీ, అన్న కూతురు తనకూ కూతురేననీ ఎంతో ఆదరంగా చెప్పాడు నా మరది. అతని మాటలు నమ్మి వెళ్ళాను. పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లయింది నా పని! అక్కడ నానా అగచాట్లూ పడ్డాను. నేను చేసే చాకిరీ చాలదన్నట్లు, పిల్లనుకూడా బడి మానిపించి, దాని చేతకూడా అడ్డమైన చాకిరీ చేయించసాగారు! నా బాధలన్నీ చెప్తూ మిమ్మలను బాధ పెట్టున్నానేమో?" అని, ఆగి తన ముఖంలోకి చూసింది రాజమ్మ!.

ఆమె ముఖంలోని దైన్యం, కన్నుల్లోని తడి తన మనసును కలచివేసాయి.

"అదేంమాట! అన్ని కష్టాలు మీరు పడగా, వినడం నాకు కష్టమా? ఊఁ..తర్వాత చెప్పండి!"

"పిల్లకు పదహారేళ్ళు రాగానే ఓ రెండోపెళ్ళి వాడికిచ్చి పెళ్ళి చేసాడు నా మరది. మా ఇద్దరి ఇష్టాయిష్టాలను కనీసం మాట వరసకైనా అడగలేదు. అల్లుడికి అన్ని అవలక్షణాలూ ఉన్నాయని తర్వాత తెలిసింది నాకు. కానీ, చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభమేంటి? నాకు నేను ధైర్యం చెప్పుకుని, అమ్మాయికి ధైర్యం చెప్తూ వచ్చాను. ఓ సంవత్సరం గడచింది. అలాంటి మొగుడితో ఏభార్యా సంసారం చేయలేదు. మొదటి భార్య ఉరిపోసుకుని చచ్చిపోయింది. నా కూతురు బావిలో దూకి ప్రాణం తీసుకుంది. ఇది జరిగి ఓ సంవత్సరం అయింది. నా బ్రతుకంతా చీకటిమయం అయింది. ఎందుకు బ్రతకాలో అర్థం కాకున్నా ఆత్మహత్య మహాపాతకమని వాళ్ళ పంచనే పడి రోజులు నెట్టున్నాను. రెండు వీధుల అవతలే నా మరది ఇల్లు. నాకెవరూ లేరని నన్ను మరీ హీనంగా, కుక్కకన్నా హీనంగా చూడడం ప్రారంభించింది నా తోటికోడలు. వాళ్ళింట్లోనే ఉండి, వాళ్ళు పడేసే ఆ ఎంగిలి మెతుకులు తినడం కన్నా మీలాంటివారి ఇంట్లో తల దాచుకోవడం మేలన్న నిర్ణయానికొచ్చాను. మీ గురించి విన్నాను. నాకేదన్నా దారి చూపుతారేమో అన్న ఆశతో వచ్చాను." చివరి మాటలు చెప్తున్నప్పుడు ఆమె గొంతు దుఃఖంతో జీర వోయింది.

ఆమె కథవిన్న తను భారంగా నిట్టూర్చింది.

"నేను పెద్దగా ఎవ్వరికీ ఏ సాయమూ చేయలేదు..." అంతటి దాన్ని కాను...."

"అలా అనకండి! మీనుండి సాయం పొందిన వారే నన్ను మీ దగ్గరకు వెళ్ళమని సలహా ఇచ్చారు. నన్నా నరకం నుండి రక్షించండి! ప్రతిఫలంగా నేను మీకేమీ ఇవ్వలేక పోయినా, ఆ జన్మాంతం మీకు కృతజ్ఞురాలిగా ఉంటాను" అంటూ తనవేపు చూసిన ఆమెకన్నుల్లోని తడిని తను గమనించకపోలేదు

కొద్దిక్షణాలు తను మౌనంగా ఆలోచిస్తూ ఉండి పోయింది.

"డిగ్రీలున్న వారికే ఉద్యోగాలు దొరకని రోజులివి! నాకు తెలిసిన ఓ అనాధాశ్రయంలో ఆయాపోస్టు ఖాళీగా ఉందని తెలిసింది. ప్రయత్నించి చూస్తాను. రేపోసారి వచ్చి కనిపించండి!"

ఆ మాటలు వినగానే రాజమ్మ కళ్ళల్లో ఆశారేఖలు తళుక్కుమన్నాయి. మర్నాడు తప్పక వస్తానంటూ సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. వెంటనే ఆ ఆశ్రయం అధికారికి ఫోన్‌చేసి మాట్లాడింది. రెండురోజుల క్రితమే ఆ ఉద్యోగం ఎవరికో ఇచ్చినట్లు అతను తెలిపాడు. మర్నాడు వచ్చిన రాజమ్మతో ఆ విషయం చెప్పగా, ఎంతో బాధపడి, తన దురదృష్టాన్ని నిందించుకుంది.

రాత్రినుండీ రాజమ్మకేవిధంగా సాయపడగలనా అని ఆలోచిస్తున్న తన ఆలోచనలకు అప్పటికో రూపం ఏర్పడింది.

"రాజమ్మా! నీకెలాంటి అభ్యంతరం లేకుంటే, మాఇంట్లో నాకు తోడుగా, సాయంగా ఉండకూడదూ? అమ్మాయిలకు పెళ్ళిళ్ళై వెళ్ళిపోయాక, మరీ ఒంటరిగా, ఒక్కసారీ ఒంటరితనం భరించలేనట్లుగా అనిపిస్తోంది!"

ఆ మాటలకు ఆశ్చర్యంగా చూసింది రాజమ్మ.

త్వరపడ్డానేమో అనిపించింది తనకు.

రాజమ్మ ఎలాంటిదో తెలుసుకోకుండా, తన ఇంట్లో ఆశ్రయం ఇవ్వడం, అంత వివేకమైన పనికాదేమో అనిపించింది కానీ, ఆ ఆలోచనలు అట్టేసేపు తన మనసులో నిలవలేదు.

అన్ని కష్టాలు పడ్డ మనిషిలో ఇంకా స్వార్థం, మోసం ఉంటాయా, తన పిచ్చిగానీ?

రాజమ్మ మౌనంగా ఉండటం చూసి తిరిగి తనే అంది.

"ఆయనపోయి ఐదు సంవత్సరాలైంది. నా కర్తవ్య పాలనలో నా దుఃఖాన్ని నిరాశనూ ప్రక్కకు నెట్టాను. కానీ, ఇప్పుడవి నన్ను కబళించి వేస్తున్నాయి. నాకింకా ఓ ఐదు సంవత్సరాల సర్వీసుంది. తర్వాత విషయం ఆలోచించవచ్చు. నీకు మనస్ఫూర్తిగా ఇష్టమైతేనే, రా! నీ తిండికీ బట్టకూ ఏలోటూ ఉండదు. నెలకు ఏభైరూపాయలు బ్యాంక్‌లో వేస్తాను. పని మనిషి ఎటూ ఉంది. అంత వండిపెట్టి, నాకు తోడుగా ఉంటే చాలు. ఆలోచించుకుని, ఏ విషయమూ రేపు చెప్పు.."

"ఇంకా ఆలోచన ఎందుకమ్మా? నరకకూపం నుండి బయటకు రమ్మంటే, రాననేటంతటి మూర్ఖురాలినికాదు. ఉన్న రెండు గుడ్డముక్కలూ తీసుకుని రేపుపొద్దుటే వస్తాను. ఏమంటారు?"

"అలాగే సంతోషం!"

అన్నట్టే ఆ మర్నాడే వచ్చింది రాజమ్మ.

ఆరోజు నుండీ, ఈరోజు వరకూ రాజమ్మ వంట మనిషిలా తనకేరోజూ అనిపించలేదు. తోబుట్టువులా.. ఊహు..ఇంకా ఎక్కువే అనిపించసాగింది. తన నిర్ణయం తొందరపాటుతో తీసుకున్నది కాదని నిరూపించింది రాజమ్మ ప్రవర్తన.

ఆమె నిజాయితీ, తన పట్ల ఆమెకున్న ఆప్యాయతా, కృతజ్ఞతా తన జీవితానికో కొత్త ఊపిరినిచ్చాయి.

వంటపనితో సరిపెట్టుకోక, నిరాదరణతో వాడిపోయిన ఇంటిముందున్న పూలతోటను తిరిగి వికసింపచేసింది. అంతేకాదు, తన దగ్గర చదవనూ వ్రాయనూ నేర్చుకుని,

ఇప్పుడు మంచి మంచి పత్రికలూ, ఉత్తమగ్రంథాలు చదివే స్థాయికి ఎదిగిపోయింది రాజమ్మ!

అమ్మాయిలు పిల్లాపావల్తో వచ్చి ఓ పదిరోజులున్నా ఏమాత్రం విసుక్కోక, సంతోషంగా వాళ్ళకన్నీ అమర్చి పెట్టి తన సొంతబిడ్డల్లా ఆదరించే ఆమె ఔన్నత్యాన్ని చూస్తే తనకే ఆశ్చర్యం వేస్తుంది ఒక్కోసారి!

"ఏవిటమ్మా, దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? స్నానానికి నీళ్ళు రెడీగా ఉన్నాయి రండి! పూజకు టైమైందికదా? అన్నీ మామూలు టైంకే జరిగిపోవాలని చెప్పారు కదా?" అన్న రాజమ్మ మాటలకు ఆలోచనలనుండి తేరుకుంది సరస్వతీదేవి.

"అవును రాజమ్మా! అన్నీ మామూలుటైంకే జరగాలి. ఎందుకంటే, రేపటినుండి మరో డ్యూటీలో చేరబోతున్నాను!"

"ఆ విషయం గురించేనా, ఇంతగా ఆలోచిస్తున్నారు?"

"కాదనుకో..."

"పెద్దమ్మాయి, మిమ్మల్ని రిటైర్ అయ్యాక ఆమె దగ్గరే వచ్చి ఉండమని, సెలవల్లో వచ్చినప్పుడు మరీమరీ చెప్పి వెళ్ళారుగా? అక్కడకు వెళ్ళరా? మరో డ్యూటీ అంటున్నారేవిటి?"

"అదే, పూజ అయ్యాక టిఫిను తీసుకుంటూ సావకాశంగా మాట్లాడుకుందాం!" అంటూ లోపలికి దారి తీసింది సరస్వతీదేవి.

ఓ అరగంటలో స్నానం పూజా ముగించి, డైనింగ్ టేబుల్ ముందు కూచుంది.

రాజమ్మ దోసెలు వేస్తూంది వంటగదిలో.

సరస్వతీదేవిని తిరిగి ఆలోచనలు చుట్టుముట్టాయి.

రిటైర్ కాగానే తనదగ్గరకు వచ్చి ఉండమంది పెద్దమ్మాయి.

అంతగా తోచకుంటే కొన్ని ట్యూషన్స్ కూడా అరేంజ్ చేసుకోవచ్చునని ఓ చిన్న సలహా కూడా ఇచ్చింది! అల్లుడు కూడా "ఒక్కరే ఇక్కడ ఉండడం ఎందుకండీ? హైద్రాబాద్ వచ్చేయండి!" అని చెప్పాడు వెళ్ళేముందు.

"ఆలోచిస్తాను. ఇంకా ఆర్నెల్లు టైం ఉందిగా?" అంది తను మృదువుగా.

రెండో అమ్మాయి దగ్గర్నుండి వారం క్రిందటే ఉత్తరం వచ్చింది. దాని సారాంశం.

"అమ్మా! ఎలాంటి పరిస్థితుల్లోనూ నువ్వు హైద్రాబాద్ వెళ్ళొద్దు. ఒకరింట్లో ఉండవలసిన అవసరం నీకేం లేదు. కొత్తలో బాగా చూసినా, కొన్నాళ్ళకు పాత చుట్టానివై, వాళ్ళకు డబ్బు సంపాదించే యంత్రంగా, క్రమంగా పనిమనిషిలా మారిపోయే ప్రమాదం ఉంది! సొంత ఇల్లుంది. నీవొంట్లో శక్తీ, వోపికా ఉన్నాయి. నీకు వండిపెట్టేందుకు రాజమ్మ ఉంది. నేను దసరా సెలవలకు వొచ్చినప్పుడు, నీకు ఏదో ట్యుటోరియల్ కాలేజి వాళ్ళు ప్రిన్సిపాల్‌గా ఉండమని అడిగారుగా? రెండువేలు ఇస్తామన్నట్లు గుర్తు. రిటైర్ కాగానే ఆ ఉద్యోగంలో చేరు. నీకు కాలక్షేపమేగాక, నీ విద్యార్హతలకు అనుభ వానికీ తగిన ఉద్యోగం అది! ఒకరికి నువ్వు పెట్టే స్థితిలో ఉన్నప్పుడు ఎవరి పంచనో పడి ఉండవలసిన అవసరం నీకేవిటి?

అమ్మా! అన్నట్టు ఓ విషయం చెప్పడం మరచిపోయాను. మీ అల్లుడు కారు కొనాలనుకుంటున్నారు. సెకండ్‌హాండ్‌దే అనుకో! మా దగ్గర ఓ పాతిక వేలున్నాయి. నువ్వో ఇరవైవేలు సర్దావంటే వెంటనే కారు కొనుక్కోవచ్చు. నాకు డబ్బు ఇవ్వడం అక్కకు ఏవన్నా అభ్యంతరం అయితే అప్పుగానే ఇవ్వు. డబ్బు తప్పక పంపుతావని ఆశిస్తున్నాను' అంటూ ఇంకా ఏవేవో విషయాలు వ్రాసింది. కానీ, సారాంశం మటుకు అక్క దగ్గరకు వెళ్ళొద్దని, ఓ ఇరవైవేలు పంపమనీ, ఇంకా సంపాదించమనీ! ఇద్దరిలో ఎవరు ఎక్కువ స్వార్థపరులో అర్థంకాని విషయం!

"తినండమ్మా!" అన్న రాజమ్మ మాటలకు ఉలిక్కి పడి తలెత్తి చూసింది సరస్వతీదేవి— ఎదురుగా టిఫినుప్లేటు.

"నువ్వూ తెచ్చుకో, రాజమ్మా!"

రాజమ్మ తనూ టిఫిను తెచ్చుకుని, సరస్వతీదేవికి ఎదురుగా కూచుంది.

ఇద్దరూ టిఫిను తినడం ప్రారంభించారు.

"కొబ్బరి చట్నీ బాగుంది రాజమ్మా!"

"అన్నంలోకి కూడా కొస్త ఉంచాను. అయినా యీవంటావార్పూ మీ దగ్గర నేర్చుకున్నవే కదమ్మా?" రాజమ్మ గుండెలోని కృతజ్ఞత ఆమె కన్నుల్లో వ్యక్తమైంది.

సరస్వతీదేవి మృదువుగా నవ్వుతూ—

"అన్నట్టు నేను పెద్దమ్మాయి దగ్గరకు వెళ్ళిపోతే, నువ్వెక్కడ ఉంటావు, రాజమ్మా?" అంది రాజమ్మ ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

"ఎక్కడో మీలాంటి ఇల్లే ఇంకోటి దొరక్కపోతుందా?" చిరునవ్వుతో అంది రాజమ్మ.

ఇద్దరూ తమతమ ఆలోచనల్లో తేలిపోతూ, టిఫిను తినడం పూర్తిచేసారు.

రాజమ్మ కాఫీ తెచ్చి సరస్వతీదేవి ముందు ఉంచింది. కాఫీ మగ్గు చేతిలోకి తీసుకుంటూ—

"నేను పెద్దమ్మాయి దగ్గరకూ వెళ్ళను. చిన్నమ్మాయి చెప్పినట్లూ చేయను!" అంది స్థిరకంఠంతో.

ఆశ్చర్యంగా చూస్తూ "మరేం చేస్తారు?" అంది రాజమ్మ.

"మరోడ్యూటీలో చేరబోతున్నానని చెప్పానుగా? బాగా ఆలోచించాక, అదే నా మనసుకు నచ్చిన మార్గమనిపిస్తుంది!"

"ఏవిటమ్మా, అది?" కుతూహలంగా అడిగింది రాజమ్మ.

"నాకు చిన్నప్పటినుండీ ఒక కోరిక ఉండేది రాజమ్మా! నలుగురికీ ఉపయోగపడేపని ఏదైనా చెయ్యాలని. కానీ ఎప్పటికప్పుడు ఏవో శృంఖలాలకు కట్టుబడిపోవలసి వచ్చేది. ఆర్థికమైన ఇబ్బందులూ, సాంఘికమైన కట్టుబాట్లూ నన్నింత కాలం కట్టిపడేశాయి. ఇక, ఇప్పుడు ఏ బాధ్యతలూ, బరువులూ లేవు. ఆర్థికమైన ఇబ్బందులూ పెద్దగా లేవు. ఇంకో పదేళ్ళపాటు పనిచేసే శక్తి నాకుంది. అందుకే ఓ అనాధ శరణాలయం వాళ్ళకు నాచేతనైన సాయం చేస్తానని మాటిచ్చాను. 200 మంది పిల్లలున్న ఆ ఆశ్రయం సరిగ్గా జరిగేటట్లు చూడడం నా బాధ్యత. ఆదరణా ఆప్యాయతా కొరవడిన ఆ పిల్లలకు వాటినివ్వడమే నా శేషజీవితంలో నేను చేయతగిన మంచి పనిగా నాకనిపిస్తున్నది. ఉదయం పదిగంటలనుండి, సాయంత్రం ఐదుగంటలవరకు అక్కడే ఉండి ఆ పిల్లల ఆలనాపాలనా చూడాలి. అన్నట్టు, నువ్వూ నాతో వచ్చి, ఆ దురదృష్టవంతులైన పిల్లలకు నీ ప్రేమను పంచిపెట్టరాదూ? అయితే, ఈ పనిని మనం డబ్బు, పేరుకోసమో, పేపర్లలో ఫోటోలు పడడంకోసమో చేయబోవడం లేదని గుర్తుంచుకోవాలి!"

"ఆ పేరూ, ఫోటోలు, డబ్బు నాకెందుకమ్మా? ఒక మంచిపని చేయమన్నారు. మనస్ఫూర్తిగా చేస్తాను! ఎవరూలేని నాకు ఇకపై వాళ్ళే నా పిల్లలు!"

"ఎంత మంచి మాట చెప్పావు! రేపటినుండి మనం ఈ కొత్త ఉద్యోగంలో చేరబోతున్నాం!" అంది నవ్వుతూ సరస్వతీదేవి.

ఆమె నవ్వులో తన నవ్వునూ కలిపింది రాజమ్మ.

ఇద్దరి చూపులూ భవిష్యత్తులోకి చూసాయి.

అనురాగానికి నోచుకోని అనాధలకు, దాన్ని పంచి పెడుతున్న ఇద్దరి స్త్రీల ఊహాచిత్రం వాళ్ళ కళ్ళ ముందు కదిలింది!

రచయిత్రి చిరునామా:
ఎమ్. పద్మావతి (కలంపేరు: వాచస్పతి)
ఎ - 48, బి.హెచ్.పి.వి. టౌన్‌షిప్
విశాఖపట్నం - 530 012

'నాట్యమయూరి'



## బోడపాటి శ్రీలక్ష్మి సువర్చల

**కు**మారి సువర్చల గుంటూరు వాస్తవ్యులైన శ్రీవెంకటేశ్వరరావు, రమాదేవి గార్ల కుమార్తె. బి.ఎస్సీ. చదువుతోంది. శ్రీలక్ష్మి సువర్చల గుంటూరు నాగార్జున సాంస్కృతిక కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మహంకాళి సూర్యనారాయణ శర్మగారి వద్ద, ఎనిమిది సంవత్సరములనుండీ కూచిపూడి, భరతనాట్యములలో శిక్షణ పొందుతోంది.

త్యాగరాజస్వామి వారికీర్తనలు, నారాయణ తీర్థుల వారి తరంగములు భామా కలాపము నృత్యాలలో శ్రీలక్ష్మి సువర్చల కనపరుచు అభినయ కౌశలము ఈమె ప్రతిభకు తార్కాణం. అష్టపదులు, జావళీలు, శబ్దములు, అన్నమాచార్య కీర్తనలు, తిల్లానా మున్నగు అంశాలలో ప్రముఖుల ప్రశంసల నందుకొన్నది.

చిలకలూరి పేటలో **1984** సం॥ ఏప్రిల్ నెలలో 'కళానిలయం' వారిచే జాతీయ స్థాయిలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీలలో ప్రథమ బహుమతి, 'నాట్యమయూరి' బిరుదు, బంగారు పతకం పొందింది. విజయవాడ ఆంధ్ర నాటక కళా సమితి, బాలల అకాడమీ, మున్నగు వారి రాష్ట్రస్థాయి పోటీలలో బహుమతులు గెలుచుకొన్నది. ఇప్పటికి సుమారు **150** కుపైగా ప్రదర్శనలు ఇచ్చియున్నది.

నాగార్జున విశ్వవిద్యాలయంవారి రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య పోటీలలో ప్రథమ బహుమతి పొందింది. ఇటీవల అమలాపురంలోని 'త్రివేణి' సాంస్కృతిక సంస్థ వార్షికోత్సవంలో, నాగార్జున సాంస్కృతిక సంస్థవారు ప్రదర్శించిన నృత్యనాటిక —'సౌందరనందం' (రచన. ఆచార్య-శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు, సార్వత్రిక విశ్వవిద్యాలయం) మేనకగా ఈమె ప్రదర్శించిన హావభావాలు, నాట్యం ప్రేక్షకుల ప్రశంసల నందుకున్నాయి.

—వారణాసి జానకీదేవి